ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.08.10.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో ఈరోజు విచారణ కొనసాగుతోంది.
2. రాష్ట్రంలో పండిన పత్తిని వందశాతం కొనుగోలు చేస్తామని, రైతులు ఇబ్బంది పడవద్దని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.
3. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు డిమాండ్ చేశారు.
4. ఈరోజు హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ తో సహా 17 జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆయా జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీ చేసింది.

------------------------

హైకోర్టు విచారణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో ఈరోజు విచారణ కొనసాగుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసిందని, ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యిందని న్యాయవాదులు ధర్మాసనానికి విన్నవించారు. ఈ అంశంపై దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు తిరస్కరించిన అంశాన్ని కూడా లాయర్లు ప్రస్తావించారు. మరోవైపు... హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న సాయంత్రం మంత్రులు, న్యాయ నిపుణులతో చర్చలు జరిపారు.

డెస్క్

----------------------

పత్తి కిషన్ రెడ్డి

రాష్ట్రంలో పండిన పత్తిని వందశాతం కొనుగోలు చేస్తామని, రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ అంశంపై కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తో చర్చించినట్లు ఆయన తెలిపారు. పత్తిలో తేమ శాతాన్ని తగ్గించి, కొనుగోలు కేంద్రాలకు పంపే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. గతయేడాది రాష్ట్రంలో 80 శాతం పత్తిని కేంద్రం కొనుగోలు చేసిందని ఆయన గుర్తు చేశారు. రైతులు ఒకేసారి మార్కెట్ కు పత్తిని తీసుకొచ్చి ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి చెప్పారు.

పీఎన్

----------------------

మెదక్ కేంద్ర బృందం

ఇటీవల కురిసిన వర్షం కారణంగా రోడ్లు, పంట, ఆస్తి నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందం మెదక్ జిల్లాకు చేరుకుంది. బృంద్రం సభ్యులు డాక్టర్ కే.పొన్ను స్వామి, వినోద్ కుమార్, అభిషేక్ కుమార్, ఎస్.పింటు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

పీటీసీ మెదక్

----------------------

ఆర్టీసీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) లో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి ఈరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. 17 వందల 43 పోస్టుల్లో డ్రైవర్ కొలువులు 1,000 కాగా, శ్రామిక్ పోస్టులు 743 ఉన్నాయి. ఈనెల 28 వరకు దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లో

స్వీకరిస్తారు. ఎస్సీ అభ్యర్థులు వర్గీకరణ (గ్రేడ్ 1,2,3) ప్రకారం కొత్త ఫార్మాట్‌లో కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

డెస్క్

--------------------

కాంగ్రెసు

రాష్ట్ర మంత్రులు ఎక్కడ మాట్లాడినా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని PCC అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంత్రుల మధ్య  పరస్పర విమర్శలు, ఆరోపణాలూ చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో హైదరాబాద్ లోని తన నివాసంలో PCC అధ్యక్షుడు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో సమావేశం అయి సమన్వయ పరిచారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వారి మధ్య జరిగిన ఘటనలు కుటుంబ సమస్యగా అభివర్ణించారు.

**MSL**

-----------------------------

సిరిసిల్ల పత్తిరైతులు

పత్తి పంటలో జింకు లోపం నివారణకు  రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారి వినీత సూచించారు.  రైతు వేదిక లో  ఆమె మాట్లాడుతూ.. పత్తిలో జింకు లోపం నివారణకు అధికారుల సూచనలు పాటించాలన్నారు.

బైట్ - వీనిత, మండల వ్యవసాయ అధికారి

పీటీసీ సిరిసిల్ల

---------------------

ఎన్ఐఎన్ సమ్మిట్

భారత వైద్య పరిశోధన మండలి (ICMR) – నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (NIN) డిసెంబర్ నాలుగు, ఐదు తేదీలలో హైదరాబాద్‌లో జాతీయ ఇన్నోవేషన్ సమ్మిట్ ను నిర్వహిస్తోంది. పోషకాహార నూతన ఆవిష్కరణ, విశ్వ జనీన ఆహార సాధికారత ఎంపవర్‌మెంట్ (INFUSE) అనే ఇతివృత్తంతో జరిగే ఈ సమ్మిట్, పోషకాహారం, ఆహార సాంకేతికత రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

పీఎన్

------------------------

సమ్మక్క యూనివర్సిటీ

ములుగు జిల్లాలో ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం లోగోను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నిన్న ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మాట్లాడుతూ... పరిశోధనలు, సృజనాత్మకతకు ఈ యూనివర్సిటీని వేదికగా మార్చాలని, గిరిజన భాషల్లో కూడా పాఠ్యాంశాలు బోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. మరో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ విశ్వవిద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం 800 కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేయడం గిరిజన విద్య, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

పీఎన్

----------------------

సిరిసిల్ల కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కే.తారక రామారావు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అడవిపదిర గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాంపల్లి సతీష్ ను, నిన్న రాత్రి ఆయన పరామర్శించారు. 25 వేల రూపాయల

ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

పీటీసీ సిరిసిల్ల

---------------------

దగ్గుమందు

విషపూరితమైన డైథిలిన్ గ్లైకాల్ (DEG)తో కల్తీ అయ్యాయని గుర్తించిన రెండు దగ్గు సిరప్ ల వాడకాన్ని ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రిలైఫ్ దగ్గు మందు, రెస్పిఫ్రెష్ టీఆర్ దగ్గుమందును ఎవరూ వాడకూడదని ప్రభుత్వం సూచించింది.

పీఎన్

-------------------------

సంగారెడ్డి రివ్యూ

సంగారెడ్డి జిల్లాలో చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు, నిమ్జ్, టిజిఐసి ప్రాజెక్టులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. ఆయా ప్రాజెక్టుల భూసేకరణ పనులపై రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ, పరిశ్రమల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వేరువేరు దశల్లో ఉన్న పనులను సమగ్రంగా సమీక్షించాలన్నారు. భూ సేకరణ పనులు వేగవంగా పూర్తి చేసి రైతులకు చెల్లించాల్సిన నగదు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పీటీసీ సంగారెడ్డి

----------------------

వాతావరణం

ఈరోజు ఉదయం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 15.3 మిల్లీమీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 11.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మరోవైపు.. హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, జగిత్యాల, నిర్మల్, సంగారెడ్డి సహా 17 జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే

అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆయా జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీచేసింది.

పీఎన్

------------------------

రైల్వే పోటీలు

రైల్వే క్రీడా ప్రోత్సాహక మండలి ఆధ్వర్యంలో దక్షిణ మధ్య రైల్వే క్రీడా స్పోర్ట్స్ అసోసియేషన్ 47వ ఆల్ ఇండియా రైల్వే మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ నిన్న నిన్న ఈ పోటీలను ప్రారంభించారు. ఎల్లుండి వరకు జరిగే ఈ పోటీల్లో సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఆతిథ్య సౌత్ సెంట్రల్ రైల్వేలకు సంబంధించిన తొమ్మిది జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. తొలి నాకౌట్ ప్రారంభ మ్యాచ్ దక్షిణ మధ్య రైల్వే, నార్త్ ఈస్టర్న్ రైల్వే మధ్య జరిగింది. ఈ మ్యాచ్ లో దక్షిణ మధ్య రైల్వే 48 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది.

పీఎన్

----------------------------

వికారాబాద్ ఏటీసీ

ఏటీసీలలో సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు.

పీటీసీ వికారాబాద్

----------------

ఏటీసీ సంగారెడ్డి

యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ లు ఎంతగానో దోహదపడతాయని సంగారెడ్డి కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి లో ఏటీసీ సెంటర్ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు.

పీటీసీ సంగారెడ్డి

------------------

నాగర్ కర్నూల్ టీబీ

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ పిలుపునిచ్చారు. పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం టీబీ నివారణకు ఉచితంగా మందులు అందిస్తుందని తెలిపారు. సకాలంలో చికిత్స తీసుకుంటే టీబీ తగ్గుతుందని అన్నారు.

పీటీసీ, నాగర్ కర్నూల్

----------------------